# దొంగలున్నారు జాగ్రత్త!

ఆకుపచ్చ జండా సోమరిపోతు తోకలా ఊగుతోంది. తెల్ల బట్టల్లో నల్లగా తుంమలా బలిసిన గార్డు ఈలకూడా ఊదుతున్నాడు. దుబ్బుమీసాలు నున్నటి ఈలకి తగులుతుంటే, నాలుగురోజుల్నించి ఇంటికివెళ్ళని గార్డుకి తీయటి పుల్లటి వింత అనుభవాలు కలుగుతున్నాయి. మెల్లగా నత్తలా పరిగెడుతూ తన పెట్టె చేరుకున్నాడు గార్డు.

తద్దినం బ్రాహ్మణార్థంలో, న్యాయంగా పితృదేవతల్ని తరింపజేసి, భోంచేసి ఇంటికివస్తున్న మా యింటిపక్క గణపతి శాస్త్రిలా బయల్దేరింది రైలు.

ఆవేళ మార్చి ఇరవై ఎనిమిదో తేదీ; పాసింజర్లో బెజవాడ పోతున్నాను. రాజమండ్రీ వెడుతున్న రాఘవేంద్రం కనిపిస్తే, సహాయకారిగా ఉంటాడనీ, సరదాగా పిచ్చాపాటీ వేసుకోవచ్చుననీ, కలిసి టీ తాగవచ్చునని సంతోషించాను.

ప్లాట్ ఫారంకి ఎదురుగానే ఉందేమో గబగబలాడుతూ పొట్టకిందకి కట్టిన పంచి జారిపోకుండా జాగ్రత్తగా పట్టుకుంటూ ఒగర్చుకుంటూ, పరుగెట్టుకుంటూ వచ్చాడు షావుకారు సుబ్రహ్మణ్యం. వచ్చీరావడంతోటే నేరుగా మా మూడో క్లాసు బోగీలోనే చొరబడ్డాడు. అప్పుడే తన గమనస్థాయిని నడకనుంచి పరుగులోకి మార్చుకుంది రైలు. బండిని అందుకున్న తన అదృష్టాన్ని తలుచుకుంటూ తనలో తనే ఆనందించుకుంటూ, ఒక్క నెట్టుతో మమ్మల్ని లోపలికుదాయించాడు షాహుకారు.

రైలు కదలికనుచూస్తూ, గాలిపీలుస్తూ, కబుర్లు చెప్పుకుందామని గుమ్మందగ్గర కాసిన మాకు, ఆశాభంగమైంది. కనీసం నిలుచునేందుకు స్థానం అన్వేషించుకొంటూ, లోపలి చీకటిలోకి, చేపలగంపల్లోకి, ఉమ్ముల్లోకి జారుకోవలసివచ్చింది.

నడకని పరుగులోకి మార్చుకుంది రైలు. ప్లాట్ ఫారాన్నీ గేటునీకూడా వదిలేసింది. షాహుకారు తలుపువేసేసి కిటికీకి పృష్టాన్ని తగిలించాడు. చొక్కాపై కెత్తి కండువాలో విసురుకుంటున్నాడు.

నేనూ రాఘవేంద్రం మెల్లగా రెండోగుమ్మం దగ్గరికి చేరుకున్నాం; రాఘవేంద్రం నోరుగలవాడు; అర్ధనగ్నంగా నించున్న ముసలి కూలివాణ్ణి సర్దుకోమని కసిరాడు. వాడు సమాధానం ఇచ్చేలోపలే మళ్ళీ ఝుఘాయించాడు. "ఏయ్ కళ్ళు కనిపించటంలేదా ? ఎవరనుకున్నావ్ ?" అన్నాడు. తనేదో గవర్నర్నిసుమా అన్నట్టుగా; పాపం ముసలి కూలీ మనసులో తిట్టుకున్నాడో ఏమోగాని పైకిమాత్రం ఏమీ అనలేదు. మెల్లగా జరిగి చోటిచ్చాడు. దానితో గుమ్మం దగ్గరి స్థలాన్ని సానుకూలంగా ఆక్రమించాం.

షాహుకారు సుబ్రహ్మణ్యం మావూళ్ళోకి బాగాస్తోమత గల వర్తకుడు. రెండు లకారాలకి మించిపోయిందంటారు! ఈ మధ్య దివాళాతీసిన కుటుంబాలతాలూకు పది పన్నెండు ఇళ్ళుకూడా కొన్నాడు. చీకటిబజారు మహానాటకంలో తన పాత్రను యథాశక్తి పాత్రోచితంగానిర్వహించి సుఖాంతంగా ముగించుకున్న మహానుభావుడు షాహుకారు. దేవాలయాలకి సప్తాహసంఘాలకీ స్వాతంత్ర్యోత్సవంనాటి పేదల అన్నదానానికి ఆఖరికి పంచాయితీబోర్డుకికూడా వేలసంఖ్యల్లో ఉదార విరాళాలుజల్లి చేతికి ఎముకలేదనుపించుకున్నాడు.

దానధర్మాల్లో ఆయన్ని కర్ణుడితో పోల్చారో లేదో చెప్పలేదుకాని— "వర్తకమంటే ఆయనదీ వర్తకం. మనిషన్న వాడు అలాఉండాలి! మిగతావాళ్ళూ మనుషులే? ఎందుకూ—

జనాభా నింపడానికిగాని'' అనే వాక్యం ఎందరినోట్లోంచో తరుచుగా వినేవాణ్ని.

మా మూడోక్లాసు పెట్టె చీమ దూరడానికి సందు లేకుండా, చీకటిగా, ఇరుకుగా కిటకిటలాడుతోంది. చక్రాల మీద స్ప్రింగులూ, గడ్డర్లూ సైతం బరువుకి కిటకిటలాడు తున్నాయి. ఒకడు విడిచిన గాలినైనా మరొకడు నిర్భీతిగా పీల్చుకుంటున్నాడు జాన్ మత్తాయిగారి దయవల్ల! ప్రయాణీ కుల్లో ప్రతిఒకడూ వేడిగా నిట్టూరుస్తూ, దుర్విధిని తిట్టు కున్నారు. వేసంకాలాన్ని తిట్టుకుంటున్నారు. సూర్యుణ్ని తిట్టుకుంటున్నారు.

''ఎవర్ని తిట్టుకుంటే ఏంలాభం? వాళ్ళుమాత్రం ఏం చేస్తారు!'' అంటున్నాడొక ఖద్దరులాల్చీ బొద్దుమనిషి.

''రైలుపెట్టెల్లో మూడు ఫస్టుక్లాసులూ, నాలుగు సెకండ్ క్లాసులూ, నాలుగు ఇంటర్లూ వేసినవాళ్ళు మరో రెండు థర్డ్ క్లాసులు తగలేయరాదూ? మరీ మూడే వేయక పోతే! అందులోకీ రెండు ఎనమండుగురు కూర్చుండేవే'' అన్నాయి తెలివిగా కోరమీసాల గ్లాస్కోబట్టలు.

సాహుకారు ఏమీ అనలేదు. అప్పుడే భోంచేసి గుండె లూడేట్టు పరిగెత్తుకుంటూ వచ్చాడేమో మహా ఇబ్బందిగా ఒగురుస్తున్నాడు.

ఆయనబాధ పగవాడికేనా రాకూడదు భగవాన్!

పక్కసీటులో కూర్చున్న ఒకతను సాహుకారు ఖరీదైన బట్టలకేసీ, బంగారం బొత్తాలకేసీ, ఒగురుస్తుంటే కిందకి మీదికీ ఊగుతున్న పొట్టకేసీ ఎగాదిగా జాలిగా చూస్తున్నాడు. సాహుకారిమీద కరుణ హెచ్చినట్టుంది. ఆయన లేచి అంటున్నాడు: "ఇలారండి—కూర్చోండి. చాలాదూరం నుంచి కూర్చునే వస్తున్నాను" అని.

"చిత్తం చిత్తం" అనిమాత్రం తన కృతజ్ఞతను ప్రకటించాడు సాహుకారు, సీటు ఆక్రమించుకుంటూ.

కుక్కలచేత తరుమబడి, పరిగెట్టి పరిగెట్టి, ఆఖరికేదైనా మురికిగుంట కనిపిస్తే కాళ్ళుసాచి పడుకుని, తన ఆయాసాన్నంతా తీర్చుకునేందుకు ఒగురుస్తుంది పంది. అదృశ్యం జ్ఞాపకం వచ్చింది నాకు. సాహుకారు విషయంలో ఇలాంటి జ్ఞాపకాలు నీచోపమానమే కావచ్చు కాని ఆవిషయం ఎవరికీ తెలియదుకనక ఫరవాలేదు.

టెలిగ్రాం తీగలమీద పిట్టలు ఆవలించిననోళ్ళతో ఒగురుస్తున్నాయి. రైల్వేవాళ్ళ బంటాగోతుల మురికినీళ్ళలో దొరులుతూ ఒగురుస్తున్నాయి గేదెలు... సాహుకారు బాగా జార్లబడి ఒగురుస్తున్నాడు.

మావూరికేసి పోతున్న చెట్లకేసి చూస్తుంటే సిగరెట్టు కాల్చాలనిపించింది. నిజం చెప్పాలంటే ఇప్పటివరకూ రాఘు

వేంద్రం నేనూ ఏమీ మాట్లాడుకోవటంగానీ, నవ్వుకోవటం గానీ ఎరగం.

జేబులోకి వెళ్ళడానికి చేతికి దారి వెతుక్కున్నాను; సిగరెట్టు పాకెటు తీశాను; ఇద్దరం వెలిగించాం. నోటిలోని పొగ బరువుగా ఒదులుతూ రాఘవేంద్రం ఏదో చెబుతున్నాడు. రెండుకళ్ళ తోటీ అతన్ని తృప్తిగా చూడ్డానికి వీల్లేకపోతోంది. నాపక్కనే నించున్న ఆసామీ తలపాగా నా కుడికన్ను కప్పేస్తోంది.

రాఘవేంద్రం చెబుతున్నాడు: "సావుకారుగారు ఎంత నిగర్వచూడామణో చూడరా; ఎంత నిరాడంబరత్వం? ఏంతలేసివాళ్ళూ జేబులో నాలుగురూపాయలు గలగల్లాడ్డంతోటే మిట్టిపడిపోతారు. ఆ మహానుభావుడు చూడు! రెండు మూడు లక్షల కధికారి. అవునా? ఇన్ని కష్టాలకీ ఓర్చుకొని మూడోక్లాసు పెట్టెలోనే ప్రయాణం చేస్తున్నాడు... ఊఁ" అన్నాడు రాఘవేంద్రం. ఎంత ఉద్రేకంగా చెప్పాడని! అతని మాటల్లో వ్యంగ్యం లేదు; శ్లేష లేదు; ఆక్షేపణలేదు; నమ్మిన సత్యాన్ని ఘంటాపథంగా వెల్లడిస్తున్న కర్మవీరుడిలా పెట్టాడు రాఘవేంద్రం కళ్ళు.

రాఘవేంద్రం నన్ను 'ఒరేయ్' అనే సంబోధిస్తాడు. చనువుగానే మాట్లాడతాడు; వాడూ నేనూ నాలుగోక్లాసు నుంచీ థర్డుఫారంవరకూ చదువుకొన్నాం— అంతే. తర్వాత ఏమైపోయాడో తెలీదు. మావూళ్ళో వాడి తాతగారున్నారని

మాత్రం తెలుసు. ప్రస్తుతం రాజమండ్రి మున్సిపాలిటీలో గుమాస్తాగిరీ చెలాయిస్తున్నాడు.

'నేను పత్రికల్లో అవీ యివీ రాస్తాననీ' 'మావూళ్లో చాలా ప్రజాసేవ చేస్తున్నాననీ' 'ప్రజలంతా నన్ను గౌరవిస్తారనీ'— వగైరా విషయాలతో వాడికేమీ అవసరంకానీ నిమిత్తంకానీ లేదు. అసలా వివరాలు పట్టించుకోడు వాడు. వాడు నాతో 'రా' అనే మాట్లాడుతాడు. నాకూ కష్టం కలగదు.

వాణ్ణి నేనెక్కడ విడిచిపెట్టానో అక్కడే ఉండిపోయాడనీ ఏమీ చదువుకోలేదనీ, కారల్ మార్క్స్ పేరయినా విన లేదనీ, స్టీవెన్ స్పెండర్ నికూడా అర్థంచేసుకోలేదనీ నాకు మనస్ఫూర్తిగా తెలుసు. అయినా వాడు నన్ను 'ఏంరా— ఎంచేస్తున్నావురా?' అని ప్రశ్నించినపుడు చాలా సరదా వేసింది. 'ఏం చేయడంలేదురా!' అని రూపాయి అణా పైసల అర్థంలో వాడికి సమాధానం చెప్పినపుడు, 'ఓస్ అంతేనా' అన్నట్టు మొహంపెట్టి తన ఘనత చాటుకున్నా విచారించలేదు, ఏమీ అనుకోలేదు.

కాని— పేదల రక్తంలోంచి లక్షల్ని పోగుచేసుకుంటూ పోగుచేసుకోవడమే జీవితమైన షావుకారు, మూడోతరగతిలో ప్రయాణించుతుంటే పొగడ్డం వినలేకపోయాను. చాలా అసహ్యం, మహాకష్టం కలిగాయి నాకు. సిగరెట్టులాక్కుని

కిందపారేసి, ఒకతోపు తోసేద్దామా అనిపించింది. కాని ఎలా సాధ్యం? చిన్నప్పుడు నాతో చదువుకున్నవాడు— నన్ను 'ఒరేయి' అని పిలిచేవాడున్నూ మరి!

లేని ఓపిక తెచ్చుకుని జాగ్రత్తగా వింటున్నాను — ఏమీ అనలేదు. నాపక్కనున్న తలపాగా కొంచం పక్కకి ఒత్తిగిలి రాఘవేంద్రాన్ని రెండుకళ్ళతోటీ చూసే అవకాశం ప్రసాదించింది. జాన్ మత్తయిగారిని అభినందించుకున్నాను!

తనకి లభించిన సీటులో షాహుకారు వెనక్కి జార్లబడి కూర్చున్నాడు. దర్జాగా హుందాగా కూర్చున్నాడు. కూర్చుని విసురుకుంటున్నాడు. రొప్పుతూ రోజుతూ ఒగురుస్తు న్నాడు. ఆయాసపడుతున్నాడు. అప్పుడప్పుడు బొజ్జమీదా తొడలమీదా బరుక్కుంటున్నాడు. తెల్లబట్టలకి రక్తంమరక లేమీ కాలేదు.

నిజం చెప్పాలంటే— ఆ సన్ననివ్యక్తి లేచినచోటు, ఏకరాశిగా స్థూలంగాఉన్న రెండు మూడు లక్షల షావుకారుకి సగంకూడా సరిపోలేదు. అయితేనేం? సాధ్యమైనంతగా పక్కవాళ్ళను దట్టించి సుఖంగా నే కూర్చున్నాడు. పక్కవాళ్ళ నుంచి తన సౌఖ్యాన్ని పెంచుకుంటూ బదనికలా హాయిగా పెరగడం షావుకారికి వరవడితో నేర్చుకున్న పాఠం!

రాఘవేంద్రం మళ్ళీ అంటున్నాడు. "షావుకారు చాలా అదృష్టంచేసుకొని పుట్టాడురా, యేమంటావు? పూర్వ

జన్మలో ఏవో మహాపుణ్యాలు చేసుకుని ఈ జన్మలో లక్ష్మీ పుత్రుడుగా పుట్టాడు. ఈజన్మలోనో—ఎడ తెరిపిలేని దానాలు! ధర్మాలు! ఎంత అదృష్టం! ఎంతపుణ్యం! అంచేతనే లక్ష్మీ వరిస్తోందనుకో! ఏమంటావ్?

ఏమంటాను? ఏమీ అనను! రాఘవేంద్రం ఏంచెప్పినా వ్యతిరేకించదలచ లేదు. ఖండించాలనిలేదు. అంచాత వాడు చెప్పినదల్లా బుద్ధిగా వినడమే నాకు ప్రస్తుతం అవలంబించాల్సిన సమయానుకూల జ్ఞానం.

"ఏంరా మాట్లాడవేం? నేచెప్పింది రైటేనంటావా?"

నా అభిప్రాయం వెల్లడిస్తేగాని ఊరుకునేట్లులేదు. "సరేలే చెప్పు?"అన్నాను. వాడు అదోలాపెట్టాడు మొహం. చెప్పడంకోసం ఆలోచిస్తున్నాడు. నేను వినడంకోసం సిద్ధంగా ఉన్నాను.

భీకరంగా కీచుమంటూ రైలు స్టేషనులో ఆగింది. ఆగిన రైలు మాపెట్టెబరువు కొంత దింపింది. షాహుకారుకు స్థలాన్ని త్యజించి నించున్నవ్యక్తి, సీటును షాహుకారుకు దఖలుపరచి, పెట్టె పుచ్చుకొని వెళ్ళిపోయాడు. కొంతమంది కూర్చున్నవాళ్లు దిగడంతోటే నోరుగల రాఘవేంద్రం రెండుచోట్లు ఆక్రమించాడు. నన్ను రమ్మని పిలిచాడు.

ఒకచేత్తో అరటిపండ్ల అత్తెలం, మూటా, విసనకర్ర పట్టుకుని మా పెట్లోకి గన్నయ్యశాస్త్రి ప్రవేశించాడు.

"ఇదిగో సుబ్రహ్మణ్యం శ్రేష్టిగారూ!... ఎందాకా ప్రయాణం?" ప్రశ్నించాడు గన్నయ్యశాస్త్రి.

"అయ్యయ్య! రాజమండ్రిలో సరుకు ఖరీదు చేయాలని..." అన్నాడు సాహుకారు లేచి నమస్కరిస్తూ.

సావుకారుని ఏదో '...భవ' అంటూ ఆశీర్వదించాడు గన్నయ్యశాస్త్రి. బాగుందంటుగా తన ఆమోదాన్ని తెలియ పరిచాడు గన్నయ్యశాస్త్రి. ఇద్దరూ కొంతసేపు ఆప్తంగా మాట్లాడుకున్నారు. ఏం మాట్లాడుకున్నారో మేం వినలేదు. వినాలని అనుకోనూలేదు.

"ఎంత బ్రాహ్మణగౌరవమో చూడు; అంచాతనే ఆ ముఖంమీద కళ తాండవిస్తోంది." మళ్ళీ ప్రారంభించాడు రాఘవేంద్రం—

నిజం చెప్పాలంటే సావుకారి మొహం చాలా అస హ్యంగా వుంటుంది. నల్లగా, కొరకంచులా, ఎత్తుగా పాచి పళ్లూ వాడూ— పరమాస్యహంగా వుంటాడు సావుకారు. అయితేనేం? రాఘవేంద్రానికి ఆ ముఖంలో 'కళ' కనిపించ కూడదని ఎక్కడుంది? దానికి బాధ్యుణ్ణి నేను కాదు కనుక రాఘవేంద్రానికి అడ్డం చెప్పలేదు.

"సావుకారు మాటకేంగాని రాఘవేంద్రం— నీకు పెళ్ళి అయిందా?" విషయం మార్చాలని ప్రశ్నించాను. పెళ్ళి అనగానే ఏవో తీయటిఆలోచనలు, జ్ఞాపకాలు బయల్దేరినట్లు

న్నాయి. నవ్వు మొఖం పెట్టి "ఆఁ దానికేంరా? ఒక కూతురు కూడాను" అన్నాడు.

జీతం ఎంత యిస్తున్నారో అడిగాను. సరిపోతుందో లేదో తెలుసుకున్నాను. ఏవీధిలో వుంటున్నదీ వగైరా వివరించమన్నాను.

ఈరోజుల్లో సామాన్యంగా బ్రతకాలంటే ముప్పై అయిదు రూపాయలేం సరిపోతాయి? పైగా ఏదో దొరుకుతుందంటాడు రాఘవేంద్రం. ఏందోరికినా రోజుకి రెండు రూపాయలేనా లేకుండా రాజమండ్రీలో ఒక్కడేనా జీవించడమెట్లాగో నాకర్థంకాలేదు.

"నెలకి పదిహేను రూపాయలు పైని దొరుకుతాయి. వెధవ పేదవాళ్ళేమిస్తారులెద్దూ! ఇచ్చినా మానినా ధనవంతులు, ముఖ్యంగా సావుకార్లే ఇవ్వాలి" అన్నాడు తృప్తిగా రాఘవేంద్రం.

అంతాకలసి రాఘవేంద్రంగాడి జీవితం ఏభయి రూపాయలు! రాజమండ్రిలో కార్మికులికిసైతం నెలకి ఏభయ్యో నలభయ్యో కిడుతుంది. అయినా వాళ్ళు కార్మికులమనే సత్యాన్ని విస్మరించకుండా తమ హక్కులకోసం పోరాటం సాగిస్తూంటారు.

రాఘవేంద్రం ఖరీదు అక్షరాలా ఏభయి రూపాయలు ......అయితేనేం? సావుకారిలో మంచితనాన్ని చూస్తాడు.

ఎవ్వరికీ నష్టంలేదు. సావుకారి నిరాడంబరత్వాం మెచ్చు కుంటాడు. పోనీలే, ఇబ్బందిలేదు! సావుకారు సిరిసంపదలకి ఆయన దైవభక్తీ బ్రాహ్మణభక్తి కారణాలంటాడు. అయినా ప్రమాదంలేదు. సావుకారు పూర్వజన్మవృత్తాంతం గురించి లెక్కలు వేస్తాడు. ఫరవాలేదు! కాని తనూ, సావుకారిలా ధనవంతుణ్ణవాలనుకుంటాడు— అదే ప్రమాదమైన ఆలోచన! ఎలా అవగలడు? ఎన్ని పుటాలేస్తే మారుతుంది ఏభయి రూపాయలు ఖరీదుచేసే అతని జీవితం?

ఒక్కక్షణంక్రితం నాప్రక్కనించున్న తలపాగా ముసలి కూలివాణ్ని కసిరిపారేశాడు. సర్వవిధాలా అతనిమీద పెత్తనం చెలాయించాలని ప్రయత్నించాడు. అవునుమరి! పేదవాళ్ళంటే అసహ్యం రాఘవేంద్రానికి.

రాఘవేంద్రం గురించి ఆలోచిస్తున్నాను. రైలు నిప్పులు కక్కుకుంటూ సావుకారి అదృష్టంలా వెళ్ళిపోతోంది. హుందాగా నడుస్తూ, మధ్యమధ్య కీచుగా అరుస్తూ, జీవితాన్ని కొలుస్తూ పోతోంది రైలు.

రాఘవేంద్రం కూడా ఆలోచిస్తున్నాడు; ఇంటిదగ్గర భార్యగురించో, ఆఫీసులో తోటిగుమాస్తా సంపాదన హెచ్చడం గురించో, తను షావుకారిలా అవడంగుంంచో— రైలుబండి నడకలా రాఘవేంద్రం ఆలోచనలు! మూలగా కూర్చున్న రాఘవేంద్రం ఆలోచించి, చించి...చించి...కునికిపాట్లుపడ్డం ప్రారంభించాడు.

రాఘవేంద్రం గురించి ఆలోచిస్తున్నాను. ఇంటిలోంచి వీధిలోకి వచ్చేసరికి ఎంతమంది రాఘవేంద్రాల్ని చూస్తాం? తాను పేదరికంలో మాడిచస్తున్నా పేదవాళ్ళని అసహ్యించుకుని ద్వేషించేవాడూ, తనజీవితం ఖరీదు ఏభయి రూపాయలే అయినా లక్షాధికార్ల గుణగణాన్ని అంటిపెట్టుకుని మసిలే వాడూ, ఆచంట రాఘవేంద్రం ఒక్కడేనా?

రాఘవేంద్రంగురించి ఆలోచిస్తూ బుర్ర పైకెత్తేను. "దొంగలున్నారు జాగ్రత్త!" అనే రైల్వేవారి శాసనం కంట పడింది. దొంగమార్కెటును నాశనం చేయడానికీ, లంచ గొండితనాన్ని హతమార్చడానికీ, జమీందార్ల నిరంకుశత్వాన్ని అంతంచేయడానికీ మన కాంగ్రెస్ ప్రభుత్వంవారి శాసనాల్లాగే మహాశక్తివంతమైనదీ శాసనం! నిత్యం బుర్ర ఎత్తిన ప్రతి ఒక్కడికీ ఈ హెచ్చరిక కనిపించడం మానక పోయినా, దొంగలుకూడా మనుషులే కాబట్టి ప్రమాదరహితంగా ప్రయాణాలు చేయిస్తుంది! వాళ్ళ అదృష్టాన్ని నిత్యం ఫలింపచేస్తూనే ఉంటుంది.

గాలి మళ్ళింది. మళ్ళకేంచేస్తుంది.? కొంచం గాలి పెట్టెలోకి ప్రవేశించింది— ఉట్టుకున్న ప్రయాణీకుల గుండెలు చల్లబడ్డాయి— నేను జాన్ మత్తయ్‌ని అభినందించుకున్నాను.

రాఘవేంద్రం చల్లగాలికి జార్లబడి నిద్రపోతున్నాడు. దగ్గరి కలకూడా కంటున్నాడల్లేవుంది— మొహం నవ్వు

తోంది— లక్షరూపాయలు లాటరీలో వచ్చినట్టు; పెళ్ళాంతో నలభై ఎనిమిది మోడల్ షెవర్లెట్ కారులో బజారులోకి వెళుతున్నట్టు; రేడియో కొంటున్నట్టు; పాపం కలకంటాడు రాఘవేంద్రం!

షావుకారు బొజ్జమీద బరుక్కుంటున్నాడు— పర్సు తీసుకొని ఏదో కాగితంమీద ఏవో అక్షరాలు బరికి, కాగితంతో సహా పర్సు దాచేసుకుంటున్నాడు; సంచీలోంచి బత్తాయి కాయి తీసి ఒల్చుకుంటున్నాడు.

రాఘవేంద్రం కేసి చూస్తూ ఆలోచిస్తున్నాను— షావుకారు కేసి చూస్తూ రైల్వేశాసనం మననం చేసుకుంటున్నాను— రైలు ఏవో బీజాక్షరాలు చదువుకుంటూ వెళ్ళిపోతోంది— వేగంగా, శతవేగంగా...!

రాజమండ్రి వచ్చింది— రాజమండ్రి మాదగ్గరికి వచ్చిందా? మేం రాజమండ్రీ దగ్గరికి వెళ్ళామా అన్న తర్కానికి కథతో సంబంధంలేదు కాబట్టి విడిచిపెడదాం— ఆలోచించుకుని నిద్రపోయి కలలుగన్న రాఘవేంద్రం ఉలిక్కిపడిలేచాడు. లేచి నిలబడ్డాడు— 'వస్తానురా' అని చెప్పి దిగిపోయాడు. బత్తాయికాయి తింటున్న షావుకారు తొక్కలు పారేసి, మిగిలిన తొనలు జేబులో దాచుకుని దిగిపోయాడు; ఇద్దరూ దిగిపోయి వెళ్ళిపోతున్న జనాభాలో కలిసిపోయారు; షావు

కాసుగారు లాభాల్ని పుట్టించే సరుకులు ఖరీదుచేయడానికీ; రాఘవేంద్రం మున్సిపాలిటీలో ఉద్యోగం చెలాయించడానికీ.

నేను ఒక్కణ్ణే మిగిలిపోయాను; ఆలోచనల్లో, రైల్లో శాసనంలో, రైలు బీజాక్షరాలు పారాయణం చేసుకుంటూ మహావేగంగా, మనోవేగంగా...

★